క్లుప్తంగా

చెంచుగూడేల సందర్శన

చాగలమర్రి: పది రోజుల క్రితం డి.వనిపెంట మజరా గిరిజన ప్రాంతమైన చెంచుగూడెంలో జ్వరాలు ప్రబలడంతో స్థానిక వైద్య సిబ్బంది పర్యటించి గ్రామంలో దోమల మందు పిచికారీ చేయించి, జ్వరాల బారిన పడిన వారికి మందులు పంపిణీ చేశారు. శుక్రవారం ఎంపీడీఓ మహబుబ్‌దౌలా, ఇన్‌చార్జ్ ఈఓపీఆ ర్‌డీ సుదర్శనరావు స్థానిక చాగలమ్మ చెంచు కాలనీ, డి.వనిపెటంట, చెంచుగూడెంను సందర్శించి, గిరిజనులతో సమావేశమై, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం చెంచుగూడెం కాలనీలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

రెండో విడత డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని పీఎస్సీ కేవీఎస్సీ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం బీఏ, బీఎస్సీ, బీకాంలో చేరేందుకు రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియకు రిజిస్ట్రేషన్ ప్రారంభమైందని ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ శుక్రవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ అడ్మిషన్ల ప్రక్రియ ఈనెల 28వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని విద్యార్థులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అడ్మిషన్ కోసం 28 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు కళాశాలలో సంప్రదించాలని, ఉచిత రిజిస్ట్రేషన్ సౌకర్యం కూడా కల్పించినట్లు చెప్పారు.

29న ఓపెన్ చెస్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని నంద్యాల జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీన ఓపెన్ చెస్ పోటీలను స్థానిక వివేకానంద ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జి.రవికృష్ణ, కార్యదర్శి రామసుబ్బారెడ్డి శుక్రవారం తెలిపారు. వారు మాట్లాడుతూ 12 రకాల వివిధ వయస్సు కేటగిరీల్లో పోటీలు ఉంటాయని చెప్పారు. వివరాలకు సెల్ : 9010451585 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రేషన్ పంపిణీలో అలసత్వం వహించొద్దు

ఉయ్యాలవాడ : చౌకదుకాణ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ కార్డుదారులకు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ రవికుమార్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి నెల 1 నుంచి 15వ తేదీలోపు వంద శాతం సరుకులను కార్డుదారులకు అందజేయాల్సి ఉండగా.. 80 శాతం మాత్రమే పంపిణీ చేస్తున్నారని, వారి పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే స్పందన కార్యక్రమంలో గ్రామాల నుంచి 21 దరఖాస్తులు రెవెన్యూ పరంగా వచ్చాయని వీటిని క్షేత్రస్థాయిలో పరిష్కరించడంలో వీఆర్‌ఓలు వైఫల్యం చెందారని అసహనం వ్యక్తం చేశారు.

పత్తి సాగులో మెలకువలు పాటించాలి

దొర్నిపాడు: పత్తి పంటలో రైతులు మెలకువలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి సునీత సూచించారు. శుక్రవారం దొర్నిపాడులో ఆమె పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. పత్తి పంటలో తీసుకోవల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. మిత్ర, శత్రు పురుగులను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు.

బొప్పాయి పంట తొలగింపు



ముత్యాలపాడులో పంటను ట్రాక్టరుతో దున్నేస్తున్న రైతు శ్రీనివాసులు

చాగలమర్రి: వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ముత్యాలపాడు గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసులు తనకున్న రెండు ఎకరాల విస్తీర్ణంలో సాగు చేసిన బొప్పాయి పంటను శుక్రవారం ట్రాక్టరుతో దున్నేశాడు. గతేడాది రైతు రెండు ఎకరాల్లో బొప్పాయి పంట సాగు చేశాడు. వర్షాలు సమయానికి కురవకపోవడం వల్ల, పంట తెగుళ్ల బారిన పడటంతో సుమారు రూ.2లక్షల నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

మహిళ అనుమానాస్పద మృతి

- అహోబిలం మఠం బావిలో తేలిన శవం

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలం మఠంలోని గిలకల బావిలో మహిళ అనుమానాస్పదంగా మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పద్మావతి (36) కొన్నేళ్ల క్రితం భర్త నరసింహులు మృతిచెందడంతో ఒంటరిగా ఉంటూ దేవస్థానంలో స్వీపర్‌గా పనిచేస్తూ ఇద్దరు పిల్లలను పోషించుకుంటోంది. అయితే శుక్రవారం స్నానం చేసేందుకు ఓ వ్యక్తి బావి దగ్గరకు వెళ్లగా బావిలో శవం కనిపించింది. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు మృతదేహాన్ని బయటకు తీయగా స్వీపర్‌గా పనిచేసే పద్మావతిగా గుర్తించారు. సీసీ కెమారాలు పరిశీలింగా పద్మావతి ఒక్కతే బావి వద్దకు వెళ్లినట్లు కనిపించింది. కాగా మఠంలో పీఠాధిపతి ఉండటంతో పాటు శ్రావణ శుక్రవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో ఉండగా ఎవరూ చూడకుండా బావిలో ఎలా పడుతుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతురాలి తల్లి రామక్క ఫిర్యాదు మేరకు ఆత్మహత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ నరసింహులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

ఆళ్లగడ్డ: పట్టణంలోని రామలక్ష్మి కొట్టాల కాలనీలో వెంకటలక్షమ్మ (32) అనే వివాహిత ఆత్మహత్యకు పాల్పడిందని ఎస్‌ఐ వెకంటరెడ్డి శుక్రవారం తెలిపారు. వెంకటలక్షమ్మ భర్త తాగుడుకు బానిస కావడంతో భార్యా, భర్తలు తరుచూ గొడవపడేవారు. ఈ క్రమంలో మనస్థాపానికి గురైన వెంకటలక్షమ్మ కల్లాపు చల్లే పొడి నీళ్లలో కలుపుకుని తాగి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి చలమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

పర్యవేక్షణ మెరుగుబడేలా..

- ప్రధానోపాధ్యాయులకు నాయకత్వ శిక్షణ తరగతులు
- 12 అంశాల్లో నైపుణ్యాభివృద్ధికి దోహదం



శిక్షణకు హాజరైన ప్రధానోపాధ్యాయులు

నంద్యాల(న్యూటౌన్): సర్కారు పాఠశాలలకు మహర్దశ పట్టింది. విప్లవాత్మక మార్పులతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోతున్నాయి. ఇదే క్రమంలో పర్యవేక్షణ మెరుగుపరిచి విద్యా ప్రమాణాలు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పాఠశాలల్లో ప్రధానంగా ప్రధానోపాధ్యాయులే కీలకం. నాడు – నేడు పనుల నిర్వహణ, తరగతుల కేటాయింపు, నిధులు వినియోగం, విద్యార్థుల హాజరు సామర్థ్యం పెంపుదల, మధ్యాహ్న భోజనం నిర్వహణ, విద్యార్థుల నైపుణ్యాల మదింపు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై దృష్టి సారించాలి. వీటిపై సరైన అవగాహన లేకపోతే ఆ పాఠశాల వెనుకబడి పోవడంతో పాటు ఇది పూర్తిగా వ్యవస్థపైనే ప్రభావం చూపుతోంది. ఇటీవల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ స్థాయి అధికారి క్షేత్రస్థాయిలో పాఠశాలల తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో అధికారులు గమనించిన అంశాల ఆధారంగా తొలుత ప్రధానోపాధ్యాయులకు లీడర్‌షిప్ కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో ప్రధానోపాధ్యాయులకు నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఆరు రోజుల రెసిడెన్షియల్ శిక్షణ ఇస్తోంది. ఇప్పటి వరకు నంద్యాల జిల్లాలో మూడో బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చారు. ఇటీవల నంద్యాల జిల్లాలోని ప్రధానోపాధ్యాయులకు ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మూడో బ్యాచ్‌కు 250 మంది శిక్షణ పొందుతున్నారు. ఇటీవల మూడో బ్యాచ్ శిక్షణ ముగిసింది. ఈ బ్యాచ్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన 194 మంది హెచ్‌ఎంలు, యూపీ స్కూళ్లు 35, ఎలిమెంటరీ పాఠశాలల 21 మంది హెచ్‌ఎంలు శిక్షణ శిక్షణ హాజరయ్యారు. రాష్ట్ర సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి నేతృత్వంలో లీడర్‌షిప్ శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. 2026 నాటికి పాఠశాల హెచ్‌ఎంల్లో నాయకత్వ సామర్థ్యాన్ని అభివృద్ధి చేసేందుకు ఈ శిక్షణ దోహదం చేస్తుందని అధికారులు చెబుతున్నారు. ఇదే క్రమంలో ఉపాధ్యాయులకు కూడా ఇదే తరహాలో శిక్షణ తరగతులు నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

12 అంశాలపై శిక్షణ

స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ మేనేజ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ (సీమార్ట్) పర్యవేక్షణలో రెసిడెన్షియల్ ట్రైనింగ్‌ను ప్రధానోపాధ్యాయులు తీసుకుంటున్నారు. 12 అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. స్వీయ అవగాహన, స్వీయ నిర్వహణ, కమ్యూనికేషన్, ప్రభావాన్ని చూపడం, కాన్ఫిట్, మేనేజ్‌మెంట్, అబ్జర్వేషన్ అండ్ ఫీడ్‌బ్యాక్ అంశాలపై ఇంటరాక్టివ్ సెల్ఫ్ రిఫ్లెక్షన్ మోడ్ ఫీర్ లెర్నింగ్, ఎక్స్‌పీరియన్స్‌డ్ లెర్నింగ్ తదితర విధానాల ద్వారా శిక్షణ ఇస్తున్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు తరగతుల నిర్వహణతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆనందకరమైన విధానాల ద్వారా శిక్షణ ఇస్తున్నారు. ఉదయం యోగా, ధ్యానం, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ట్రైనింగ్‌కు ముందు ప్రీ టెస్ట్, ట్రైనింగ్ అనంతరం పోస్టు టెస్టు ద్వారా ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారు.

అర్థవంతమైన చర్చ సాగింది



పాఠశాలను అభివృద్ధి పరచడానికి రోల్ మోడల్‌గా నిలిపేందుకు హెచ్‌ఎంలకు ఈ శిక్షణ ఎంతోగానో ఉపకరిస్తుంది. సానుకూల దృక్పథం, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవడానికి ఈ తరగులు దోహదం చేస్తున్నాయి. శిక్షణలో అర్థవంతమైన చర్చ సాగుతుంది. అలు అంశాలలో ఉండే అనుమానాలను అక్కడికక్కడే నివృత్తి చేసుకునే అవకాశం ఏర్పడింది.

– రవికుమార్, జెడ్పీ ఉన్నత పాఠశాల, బూజనూరు గ్రామం, గడివేముల

శిక్షణతో సత్ఫలితాలు



పాఠశాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు లీడర్‌షిప్ శిక్షణ కార్యక్రమం ఎంతో దోహదపడుతుంది. శక్తి సామర్థ్యాలతో పాటు ఆత్మవిశ్వాసం పెంచుకునేందుకు శిక్షణ ఉపయోగపడుతుంది. ఈ శిక్షణతో భవిష్యత్‌లో మార్పులు స్పష్టంగా కనిపిస్తాయి. – శ్రీవాణి, జెడ్పీ హైస్కూల్, చాపిరేవుల, నంద్యాల

ఎంతో ప్రయోజనం



ప్రధానోపాధ్యాయులకు 12 అంశాలపై ఇస్తున్న శిక్షణ ఎంతో ప్రయోజకరంగా ఉంది. కమ్యూనికేషన్ రంగంలో ప్రభావం చూపడం, కాన్ఫిట్, మేనేజ్‌మెంట్, అబ్జర్వేషన్ అండ్ ఫీడ్‌బ్యాక్ అంశాలపై ఇంటరాక్టివ్ సెల్ఫ్ రిఫ్లెక్షన్ మోడ్ ఫీర్ లెర్నింగ్ ఎక్స్‌పీరియన్స్‌డ్ లెర్నింగ్ తదితర విధానాల ద్వారా శిక్షణ పొందారు. శిక్షణ పూర్తి చేసుకున్న హెచ్‌ఎంలు పాఠశాలల్లో మరింత ప్రభావవంతమైన నాయకత్వాన్ని ప్రదర్శించే అవకాశం ఉంది.

– సుధాకర్‌రెడ్డి, డీఈఓ, నంద్యాల



ప్రత్యేక అలంకారంలో కాళికాంబదేవి



అహోబిలంలో అమృతవల్లి అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా వరలక్ష్మి వ్రతం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో శ్రావణమాసం రెండవ శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకొని భక్తులు ఉదయం మంగళ స్నానాలు ఆచరించి వరలక్ష్మి అమ్మవారి ప్రతిమను పూజిస్తూ వరలక్ష్మి వ్రతాన్ని ఆచరించారు. మహిళలు పసుపు, కుంకుమ, గాజులు, వాయినాలుగా ఒకరినొకరు ఇచ్చిపుచ్చుకున్నారు. పలు దేవాలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి వరలక్ష్మిదేవి అలంకారంలో అలంకరించారు. స్థానిక కాళికాంబదేవస్థానంలో అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వేద పండితులు అమ్మవారికి పసుపు, కుంకుమ, ఒడి బియ్యం కార్యక్రమాన్ని జరిపించి మహామంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం అమ్మవారికి పల్లకీసేవ చేపట్టారు. ఆలయ పరిరక్షణ సమితి సభ్యులు మహిళా భక్తులకు పసుపు, కుంకుమ, రవికలు వాయినాలుగా పంపిణీ చేశారు. శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అమ్మవారిని గాజులతో అలంకరించారు. కోటవీధిలోని శ్రీరమా సమేత సత్యనారాయణస్వామి ఆలయంలో వరలక్ష్మి వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు.

ఆళ్లగడ్డ: అహోబిలంలో వరలక్ష్మీ వ్రతం శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని దిగువ అహోబిలంలో శ్రీ అమృతవల్లీ అమ్మవారికి ఉదయం నిత్యపూజల అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని కొలువుంచి నవకళశ స్థాపన అనంతరం పంచామృతాలతో అభిషేకించి తిరుమంజనం చేపట్టి వరలక్ష్మి అమ్మవారిగా అలంకరించి పండితుల వేద మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల నడుమ ముత్తయిదువల ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. రాత్రి మాడ వీధుల్లో గ్రామోత్సవం చేశారు.



ఉయ్యాలవాడలో వరలక్ష్మి వ్రతం చేస్తున్న మహిళలు

ఉయ్యాలవాడ : శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని మండలంలోని వివిధ గ్రామాల్లో వరలక్ష్మి వ్రతం మహిళలు చేపట్టారు. వరలక్ష్మి దేవికి పసుపు, కుంకుమ, గాజులు, కర్పూరాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముత్తయిదువలు పసుపు, కుంకుమ, గాజులు, రవికలు, పండ్లు వాయినంగా ఒకరినొకరు ఇచ్చి పుచ్చుకున్నారు.





అహెబిలంలో అమ్మవారికి తిరుమంజనం నిర్వహిస్తున్న దృశ్యం, నంద్యాలలో సామూహిక వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్న మహిళలు

వచ్చే ఎన్నికల్లో ఎగిరేది వైఎస్సార్‌సీపీ జెండానే



గృహసారథులు, కన్వీనర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పారవి



సమావేశానికి హాజరైన నాయకులు

- చంద్రబాబు, పవన్‌వి చౌకబారు రాజకీయాలు
- ఎమ్మెల్యే శిల్పారవి

నంద్యాల(సిటీ): రాష్ట్రంలో వచ్చే ఎన్నిల్లో అత్యంత ప్రజాదరణ కలిగిన వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రథమ నందీశ్వర స్వామి ఆలయ ఆవరణలోని వైఎస్సార్ కల్యాణ మండపంలో ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డితో కలిసి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో నంద్యాలలో వైఎస్సార్‌సీపీ విజయభేరి మోగిస్తుందన్నారు. ప్రజా విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని ధీమా వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్ ఎవరి పల్లకీ మోసినా..చివరకు తన పార్టీ మనుగడనైనా నిలుపుకోవాలని సూచించారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ చౌకబారు రాజకీయాలు చేస్తున్నారన్నారని మండిపడ్డారు. తమ పార్టీకి గృహసారథులు, పార్టీ కన్వీనర్లు వెన్నెముక లాంటి వారన్నారు. ప్రతి ఒక్కరూ సమర్థవంతంగా పని చేసి జగనన్న చేసిన మంచిని ప్రజలకు వివరించాలని చెప్పారు. అనంతరం ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా మాట్లాడుతూ పార్టీ చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. అన్ని వర్గాల వారికి సమానంగా సంక్షేమం అత్యంత పారదర్శకంగా అందించిన ప్రభుత్వాన్ని మరోమారు ఆశీర్వదించాలని కోరాలన్నారు. పీపీ నాగిరెడ్డి మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల వారి అభివృద్ధికి కృషి చేస్తున్న ఏకైక సీఎం జగనేనన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, రాష్ట్ర డైరెక్టర్లు సునిత అమృతరాజ్, చంద్రశేఖర్, ఎంపీపీ శెట్టి ప్రభాకర్, జేసీఎస్ నాయకుడు పి.రాజశేఖర్ రెడ్డి, నాయకులు విజయశేఖర్‌రెడ్డి, సాయిరాంరెడ్డి, దాల్‌మీల్ అమీర్, బసవేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా సలాం



అబ్దుల్ సలాం



కృష్ణారెడ్డి

ఆళ్లగడ్డ: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ నంద్యాల జిల్లా నూతన కార్యవర్గంలో ఆళ్లగడ్డ నియోజకవర్గానికి చెందిన ఇద్దరికి సముచిత స్థానం దక్కింది. శిరివెళ్లకు చెందిన అబ్దుల్ సలాంను జిల్లా ఉపాధ్యక్షుడిగా, ఉయ్యలవాడకు చెందిన రామకృష్ణారెడ్డిని సెక్రటరీగా ఎంపిక చేశారు. అలాగే ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కృష్ణ, సరిత, ఓబులేసులుకు చోటు కల్పించారు. వారు మాట్లాడుతూ తమపై ఎంతో నమ్మకంతో పార్టీ కార్యవర్గంలో చోటు కల్పించేందుకు కృషి చేసిన జలవనరుల సలహాదారు గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు.

నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు

నంద్యాల(అర్బన్): మండల గ్రామాల్లోని క్రాస్ రోడ్ల వద్ద జరిగే ప్రమాదాలను నివారించేందుకు 11 మీటర్ల పొడవైన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ రూరల్ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవికిశోర్‌రెడ్డి గ్రామాల్లో చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన ప్రతిపాదనలను దృష్టిలో ఉంచుకొని 90 చోట్ల తక్కువ ఎత్తులో ఉన్న స్తంభాలను తొలగించి పొడవైన స్తంభాలను ఏర్పాటు చేశామన్నారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ 117 ప్రాంతాల్లో స్తంభాల ఏర్పాటుకు వినతులు వచ్చాయని, ఇప్పటి వరకు 90 చోట్ల స్తంభాలు ఏర్పాటు చేశామని, మిగిలిన చోట్ల త్వరలో ఏర్పాటు చేసి ప్రమాదాలు జగరకుండా చూస్తామని చెప్పారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

- సచివాలయాల్లో స్పందన కార్యక్రమానికి తూట్లు



22వ వార్డు సచివాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 3:15 గంటల సమయంలో సిబ్బంది లేక ఖాళీగా కుర్చీలు

నంద్యాల(సిటీ): గ్రామ, వార్డు సచివాలయాల్లో స్పందన కార్యక్రమం పటిష్టంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే ఇటీవల సచివాలయాల్లో స్పందన కార్యక్రమం సక్రమంగా నిర్వహించడం లేదని విమర్శలు వస్తున్న నేపథ్యంలో నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ గురువారం పట్టణంలోని 24, 38వ వార్డు సచివాలయాలను తనిఖీ చేసి స్పందన కార్యక్రమం సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. రోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సిబ్బంది తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చూడాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. అయితే జిల్లా కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేస్తూ.. 22వ వార్డు సచివాలయంలో శుక్రవారం మధ్యాహ్నం సిబ్బంది ఒక్కరూ కార్యాలయంలో లేకపోవడం గమనార్హం.

చేసిన మేలును చెబుతున్నాం



గోవిందపల్లెలో ప్రజలకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల

శిరివెళ్ల: నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో జరిగిన మేలును గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలకు చెబుతున్నామని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గోవిందపల్లెలో 4వ రోజు గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగింది. ఆయన గ్రామంలో ఇంటింటికీ తిరిగి బుక్‌లెట్ అందజేసి వర్తించిన సంక్షేమ పథకాలు, చేకూరిన లబ్ధిని వివరించి, జగనన్న పాలన, వలంటీర్ల సహకారం తదితర వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకోవాలని చెప్పారు. ఆయన మాట్లాడుతూ పాలన తీరు, పథకాల అమలు, సమస్యలు తెలుసుకునేందుకు ఇంటింటికి తిరిగే ఇలాంటి కార్యక్రమం దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయడం లేదన్నారు. కేవలం ఎన్నికల ముందు ఓట్ల కోసం వచ్చే నాయకులను పట్టించుకోవడం వల్లే.. వారు మిమ్మల్ని పట్టించుకోలేదని, నిత్యం ప్రజల మధ్యనుండే వారిని గుర్తించాలని కోరారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేస్తుండటంతో ప్రజలు సంతోషంగా ఉన్నారని, ఇందుకు గ్రామాల్లో ప్రజల నుంచి తమకు లభిస్తున్న ఆదరణే నిదర్శనమన్నారు. తమకు జగనన్న ప్రభుత్వం నుంచి మేలు జరగడంతోనే మహిళలు స్వచ్ఛందంగా హారతులిచ్చి స్వాగతం పలుకుతున్నారని, ఇలా ఇంతకు ముందు పాలకులకు ఇలాంటి స్వాగతం లభించకపోవడానికి కారణం ప్రభుత్వం, నాయకులు వ్యవహరించిన తీరేనన్నారు. నాడు పథకాలు అందలంటే.. సవాలక్ష ఇబ్బందులు పడేవారని, ప్రతి గ్రామంలో అతి కొద్ది మందికి మాత్రమే అందేవన్నారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదని, కేవలం అర్హత ఆధారంగా ఒక్కో కుటుంబానికి కనీసం 4–8 పథకాలు అందుతున్నాయని, పేదల ఖాతాల్లో నాలుగేళ్లలో లక్షలాది రూపాయలను జమ చేసి పాదర్శక పాలన అందజేస్తున్నామని వివరించారు. ఇంత చేస్తున్నా టీడీపీ నాయకులు విషం చిమ్ముతున్నారని, వారి మోసపూరిత మాటలు నమ్మొద్దని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు ఇందూరి ప్రతాపరెడ్డి, సర్పంచు మరియమ్మ, ఉప సర్పంచు శేషారెడ్డి, ఎంపీటీసీలు గీతాదేవి, స్వాతి, బీ.అబ్దుల్ సలాం, ఎంపీపీ నాయక్ వసీం, సొసైటీ చైర్మన్ నర్ల రాజశేఖరరెడ్డి, వీరారెడ్డిపల్లె సర్పంచు మందాల శివారెడ్డి, వంకదార సుబ్బసత్యనారాయణశ్రేష్టి, దేవస్థానం చైర్మన్ దాదిరెడ్డి తిమ్మరాయుడు, హిస్టరీ స్టేట్ డైరెక్టర్ హఫీజ్, జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్‌బేగం, నాయకులు ఉశేనిరెడ్డి, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ షేక్ మొయిద్దీన్ పాల్గొన్నారు.

కనులపండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



తలంబ్రాలు కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): స్థానిక నాగలింగేశ్వరస్వామి దేవస్థానంలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. స్వామి వారి మూలవిరాట్‌కు ఉదయాన్నే సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి, వేంటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అభిషకాలు, పూజలు నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించి పెళ్లిపీటలపై ఆశీనులు గావించారు. వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి దంపతులు, మేడం లక్ష్మయ్య దంపతులు పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు.

ఈహెచ్‌ఎస్‌లో అన్ని వ్యాధులకు వైద్యం చేయాలి

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల, ఉపాధ్యాయుల హెల్త్ స్కీం కింద అన్ని రకాల జబ్బులకు వైద్యం అందించాలని, మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఈహెచ్‌ఎస్ స్టీరింగ్ కమిటీ సభ్యులు కోరారు. ఈమేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈహెచ్‌ఎస్ నంద్యాల జిల్లా కో ఆర్డినేటర్ రూపేంద్రనాథ రెడ్డి, ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నగిరి శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలోని ఈహెచ్‌ఎస్ ఆసుపత్రులు, వాటిలో లభించే వైద్య సౌకర్యాల గురించి తెలియజేయాలని, కార్పొరేట్ ఆసుపత్రిలో అన్ని రకాల జబ్బులకు వైద్యం అందించాలని, నంద్యాల ప్రభుత్వ వైద్యశాలలో సాయంత్రం ప్రత్యేక ఓపీ ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఏపీటీఎఫ్ అధ్యక్షుడు మాధవస్వామి, ఎస్‌టీయూ అధ్యక్షుడు అజాంబేగ్ పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ పథకాలు



బుడగజంగాల కాలనీలోని మహిళలకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(సిటీ): నవరత్నాలు పథకాల ద్వారా ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందజేస్తుండటంతో సంతోషం వెల్లివిరిస్తోందని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ నగర్ 38వ వార్డు బుడగజంగాల కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని కౌన్సిలర్ సావిత్రమ్మ, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి టీవీ.రమణతో కలిసి నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించి, సంక్షేమ పథకాలకు సంబంధించిన బుక్‌లెట్‌లను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో సమస్యల పరిష్కారానికే గడప గడపకు తిరిగుతున్నామని చెప్పారు. అన్ని వర్గాల వారికి అభివృద్ధి ఫలాలను ఇంటి వద్దకే అందిస్తున్నామన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో జగనన్న మళ్లీ సీఎంగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, ఆప్కో డైరెక్టర్ సుబ్బరాయుడు, నాయకులు అంకాలయ్య, తిరుపతయ్య, ప్రసాద్‌రెడ్డి, గోరే ముర్తుజా, నరసింహారావు శెట్టి, బాబురావు, జాకీర్‌హుసేన్, అన్వర్‌బాషా, వెంకటస్వామి, పుల్లమ్మ, సోమశేఖర్, ఆచారి, బాబు, వెంకటస్వామిశెట్టి, రాము పాల్గొన్నారు.

మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



పొదుపు సంఘాల మహిళలకు మెగా చెక్కు అందజేస్తున్న జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్

నంద్యాల(వ్యవసాయం): చిరువ్యాపారులు, మహిళా పొదుపు సంఘాల మహిళలు రుణ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకొని తమ జీవనోపాధులను పెంపొందించుకోవాలని ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్ లేఖామీనన్ సూచించారు.శుక్రవారం స్థానిక కార్యాలయంలో మెప్మా అధికారుల ఆధ్వర్యంలో పొదుపు సంఘాలకు రూ.9.13 కోట్ల చెక్కు, 500 మంది చిరు వ్యాపారులకు రూ.52.50 లక్షల మెగాచెక్కులను అందజేశారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ శ్రీనివాస్, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, సేల్స్‌మేనేజర్‌ఫరిదాషాహవత్ పాల్గొన్నారు.

ఖాతాదారుల సేవలను మెరుగుపరచాలి..

ఖాతాదారుల సేవలను మెరుగు పరచాలని ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్ లేఖామీనన్ సూచించారు. స్థానిక తేజశ్వని హోటల్‌లో ఎస్‌బీఐ వెల్త్ హెచ్‌ఎన్‌ఐ ఖాతాదారుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఖాతాదారులకు బ్యాంకు లోన్, వ్యాపార రుణాలు, తదితర ఇన్వెస్ట్‌మెంట్ పథకాల గురించి వివరించారు. సమావేశంలో ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి తనయుడు జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ దస్తగిరిరెడ్డిని సన్మానించారు.

నీటి వసతి ఉంటేనే సాగు చేయండి

ఉయ్యాలవాడ : నీటి వసతి ఉంటేనే ఉద్యానవన పంటలు సాగు చేయాలని ఆ శాఖ అధికారిణి ధరిణి రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని ఇంజేడు, ఉయ్యాలవాడ, అల్లూరు గ్రామాల్లో ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన మిరప పంటను పరిశీలించారు. ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని చెప్పారు.